వంగర తాహసిల్దార్ సస్పెన్షన్

ఇన్చార్జిగా రాజం తాహసిల్దార్ కు అదనపు బాధ్యతలు

విచారణ అధికారిగా కెఆర్ఆర్సి ఎస్డిసి మురళి

విశాలాంధ్ర-వంగర/విజయనగరం: వంగర ఇన్చార్జి తాహసిల్దార్ గా విధులను నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ హెచ్. రమణారావును జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమణారావు విధి నిర్వహణలో ఉండగా, కార్యాలయంలోనే మద్యం సేవించి నట్లు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఈ ఆదేశాలను జారీ చేశారు. వంగర మండలానికి ఇన్చార్జి తాహసిల్దారు గా, రాజాం తాహసిల్దార్ కు అదనపు బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఈ వ్యవహారం పై విచారణాధికారిగా కేఆర్ఆర్సి ఎస్డిసి మురళిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలను జారీ చేశారు.

జాకేరు రాతిక్వారీలో సెకండరీ బ్లాస్టింగ్ తో దద్దరిల్లుతున్న గ్రామం

ఇంటి గోడలు బద్దలవుతున్నాయంటున్న గ్రామస్తులు

పట్టించుకోని మైనింగ్ అండ్ పొల్యూషన్ శాఖ అధికారులు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని జాకేరు రెవిన్యూలో సర్వే నెంబర్-1లో గల రాత్రి క్వారీలలో సెకండరీ బ్లాస్టింగ్లు అధిక మోతాదులతో పేల్చడం వల్ల గ్రామం మొత్తం దద్దరిల్లిపోయింది. దీంతో పలు ఇంటి గోడలు బద్దలవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతి క్వారీ యజమాని ఆళ్ల సత్తిబాబు తన వ్యాపార స్వార్థం కోసం క్వారీలో అధిక మోతాదులతో బ్లాస్టింగులు చేపట్టడం కాకుండా తాను ఇష్టానుసారం క్వారీ పనులు చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇదే విషయమై పలుమార్లు క్వారీ యజమాని దృష్టికి తీసుకెళ్లినా తనలో ఎటువంటి మార్పు రాలేదని ఎవరు ఏం చేస్తారన్న అహంభావంతో యజమాని నడుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రాతి క్వారీలో తనకు నచ్చినట్టు తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకునే నాధుడే ఇక్కడ లేకపోవడంతో మరింతగా బ్లాస్టింగులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే తనకు ఇచ్చిన అనుమతులకు మించి క్వారీని కొల్లగొడుతున్నాడని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మైనింగ్ శాఖ అధికారులు, కాలుష్య నివారణ బోర్డు అధికారులు స్పందించి తనపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.లేకుంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు అంటున్నారు.

10న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. పోటీలు విజయనగరం బస్టాండ్ పక్కన గల మెసానిక్ టెంపుల్ ప్రాంగణంలో ఉదయం 9:00 గంటల నుండి ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్షులు డా. మజ్జి శశిభూషణ్ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన పోటీదారులలో గెలుపొందినవారు రాష్ట్రస్థాయి ఆపై జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. పోటీలు 10 విభాగాలలో, 10 నుండి 55 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు పాల్గొంటారన్నారు. పోటీలు నిష్పక్షపాతంగా, క్రీడాస్ఫూర్తితో నిర్వహించబడతాయని తెలిపారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకై అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వద్దమాని నరసింహమూర్తిని 7702134568 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దమాని నరసింహమూర్తి, కార్యదర్శి, పీ.సత్యనారాయణ ఖజాంచి (ట్రెజరర్), డి.శివ, జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం శుభాకాంక్షలు తెలిసిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర -లక్కవరపు కోట: /వేపాడ ఎస్ కోట నియోజకవర్గం ప్రజలందరికీ శ్రావణమాసం శుభాకాంక్షలు అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన స్వగృహం లో ఎమ్మెల్యే లలిత కుమారి, కేబీపీ రాంప్రసాద్ దంపతులు, కుటుంబ సభ్యులు తో కలిసి శ్రావణ శుక్రవారం లక్ష్మీ పూజ నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ అష్ట ఐశ్వర్యాలు, నిరంతరము ఆయురా రోగ్యాలు తో వర్ధిల్లాలని కోరుతున్నానన్నారు. ఎల్లప్పుడూ మంచి జరగాలని అన్నారు.

పురిటిపెంటలో చోరీ

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం మండలం పురిటిపెంట మామిడిబంధ కాలనీ లో బెహరా వెంకటకృష్ణ శేఖర్ ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఇంట్లో వారు ఉద్యోగరీత్యా ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. సాయంత్రం ఐదు గంటలకు తిరిగి వచ్చాక ఇంటి తాళం తగలగొట్టి ఉందని బీరువాలోని సుమారు నాలుగు తులాల బంగారు వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు. గజపతినగరం ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆదివారం రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-గజపతినగరం : సహాయస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి రేవంత్ తెలిపారు. స్థానిక మెంటాడ రోడ్డులో గల ప్రభుత్వ పాఠశాల వద్ద ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో జరగనున్న ఈ శిబిరంలో రక్తదాతలు యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వాళ్లకి ఆదుకున్న వాళ్ళం అవుతామని తెలిపారు.

65 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-లక్కవరపుకోట: 65 బస్తాల ప్రజా పంపిణీ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసి నట్లు ఎస్సై సిహెచ్ నవీన్ పడాల్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జామి, ఎల్ కోట మండలాల్లో సేకరించిన ప్రజా పంపిణీ వ్యవస్థ కోటా బియ్యం నిల్వ ఉంచి ఎస్ కోట నుంచి-విశాఖపట్నం తరలిస్తుండగా గోల్జాం జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. విశాఖపట్నం సోమల పాలెం, కాపులప్పాడ కి చెందిన పి సురేష్, సాయి ఇద్దరూ కలిసి ఈ బియ్యం తరలిస్తుండగా నమ్మకమైన సమాచారం ఎస్సై కి తెలియడంతో తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకొని వీరిద్దరిపై కేసు నమోదు చేసి కొత్తవలస మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు

రెండు లారీలు ఢీ : ఒకరు మృతి

విశాలాంధ్ర-బొండపల్లి : రెండు లారీలు ఢీ కొన్న సంఘటన శుక్రవారం ఉదయం 4 గంటల సమయం లో బిళ్ళలవలస జంక్షన్ సమీపంలో చోటు చేసుకుంది.స్థానికులు అందించిన వివరాలు ప్రకారం ఛత్తీష్ ఘడ్, ఒడిస్సా కు చెందిన రెండు లారీలు ఎదురెదుగా గుద్దుకోవటంతో ఒక లారీ డ్రైవర్ మృతి చెందటం జరిగింది, మరొక డ్రైవర్ కు చిన్న చిన్న దెబ్బలు తగిలినవి.పోలీసులు పోస్ట్ మార్టం నిమిత్తం కేంద్రాసుపత్రికి మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-చీపురుపల్లి: తిరుపతిలో దళిత యువకుడు పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం చీపురుపల్లి అయన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తిరుపతిలో వైసిపి నాయకులు భూమన కరుణాకర్ రెడ్డి కార్యాలయంలో దళిత యువకులను బంధించి, స్పృహ కోల్పోయినట్టు క్రూరంగా కొట్టడం దారుణమని అన్నారు. యువకులను దారుణంగా ఇబ్బందులకు గురిచేసి తీవ్రంగా కొట్టి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టి ప్రజల్లో భయ ఆందోళనలను కలిగిస్తున్నారు అన్నారు. వైసీపీ దళిత ద్రోహి పార్టీ అని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో దారుణాలు చోటుచేసుకున్నాయని అన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ని ఎలా చిత్రహింసలు పెట్టి మరణాన్ని సంభవించినట్లు చేశారో ఎవరూ మరచిపోరని అన్నారు. వైసీపీ హయాంలో దళిత యువకుడిని చంపి వైసీపీ నాయకులు డోర్ డెలివరీ చేసిన ఘటనలు జరిగాయని గుర్తు చేశారు. అమాయక ప్రజలపై దౌర్జన్యాలు రౌడీయిజం చేస్తే సహించేది లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు.

జామి పిఎసిఎస్ అధ్యక్షునిగా వర్మరాజు

సందిగ్దంలో ఇద్దరు డైరక్టర్‌ల నియామకం

విశాలాంధ్ర-జామి: మండలంలోని కీలకమైన జామి పిఎసిఎస్(సొసైటీ)కి నూతన కమిటీని ప్రభుత్వం త్వరలోనే నియమించనుంది. ఇప్పటికే సొసైటీ అధ్యక్షునిగా జనసేన పార్టీకి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు వర్మరాజును నియమించారు. ఈమేరకు శుక్రవారం ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి వర్మరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమించనున్న నేపథ్యంలో చైర్మన్‌గా వర్మరాజును నియమించగా, మిగిలిన ఇద్దరు డైరక్టర్‌లను నియమించేందుకు అధికార కూటమిలో మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో సొసైటీకి పూర్తి స్థాయి కమిటీపై స్థానికులలో ఆసక్తి నెలకొంది.

గాజుల అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: శ్రావణమాసం శుక్రవారం అందులో వరలక్ష్మి వ్రతం కావడంతో పట్టణంలో ఉన్న అనేక దేవాలయాలలో ఉదయం నుండే మహిళలతో కిటకిటలాడింది. కార్తీక మాసం తర్వాత అంతటి ప్రాధాన్యత శ్రావణమాసం కు ఉంది. దీనిలో భాగంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ వారు గాజుల అలంకరణతో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా ప్రత్యేక అలంకరణ చేశారు. పైడి తల్లమ్మ వారికి ఉదయం నుండే కుంకుమ పూజలు ఆలయ ఈవో కె శిరీష ఆధ్వర్యంలో, వేద పండితులు తాత రాజేష్ శర్మ ,సాయి కిరణ్ శర్మ, అర్చక నాగేంద్ర శర్మ చేతుల మీదుగా నిర్వహించారు.శ్రావణమాసం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఉదయం నుండే చదురు, వనం దేవాలయాల వద్దకు విచ్చేసి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. దేవాలయం వద్దకు విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, పూజారి బంటుపల్లి వెంకటరావు, ధనుంజయ్ పూజలు నిర్వహించారు. దేవస్థానంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ వైవి రమణి, సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పట్నాయక్ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పైడితల్లి అమ్మవారిదేవస్థానం ఈవో కె.శిరీష మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా ప్రతి మంగళ వారం ఉదయం పంచామృతాభిషేకం ఉదయం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నామన్నారు.ప్రతి శ్రావణ శుక్రవారం రోజు విశిష్ట కుంకుమార్చనలు ,ప్రతిరోజు కుంకుమార్చన, శ్రీచక్రార్చన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు శ్రావణ పౌర్ణమి రోజున, స్వర్ణ పుష్పార్చన జరుగుతుందన్నారు. దేవాలయంలో పూజలకు విచ్చేసిన భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. భక్తుల సౌక ర్యార్థం చదరు, వనం దేవాలయాల వద్ద ప్రతిరోజు భక్తులకు ఉచిత ప్రసాదం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కావున భక్తులంతా శ్రీ పైడితల్లమ్మ వారి దేవస్థానంలో జరిగే శ్రావణ మాస పూజలకు భక్తులు హాజరవ్వాలని కోరుతున్నామన్నారు. ..

దుర్మార్గుల ఆక్రోసానికి పాడి గేదెలు మృతి

లబోదిబోమంటున్న గేదెల యజమాని

విశాలాంధ్ర -వేపాడ: ప్రస్తుత సమాజంలో మానవత్వం మంట కలిసి పోతుందని అనడంలో ఎటువంటి సందేహం లేదు. మనిషికి మనిషే శత్రువుగా మారి ఆ వ్యక్తిని ఏమీ చేయలేక తాను పెంచుకున్న పశువులపై ఆ అక్రోసాన్ని చూపించి నోరులేని మూగజీవాల ప్రాణాల తీసి ఆ పాపాన్ని మూటగట్టు కున్నాడో ఓ పశువు లాంటి మనిషి. వివరాల్లోకి వెళితే.... మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన కింతాడ సత్యరావు చాకలి కులస్తుడు. తన కులవృత్తితో పాటు కుటుంబాన్ని ఆర్థికంగా నెట్టుకు రావడానికి రెండు పాడి గేదెలను మేపుకుంటున్నాడు. నిరుపేద అయిన సత్యరావుపై ఎవడికన్ను పడిందో గాని ఎవడికి ఏమి హాని కలిగిందో తెలియదు గానీ ఆ దుర్మార్గుడు తాను మేపుకుంటున్న పశువులకు పశువులు దానా గోలెంలో యూరియా పిండిని కలిపాడు. ఇది గ్రహించని సత్యారావు శుక్రవారం ఉదయం తన రెండు గేదెలకు తాగించాడు. దానా త్రాగిన గంట వ్యవధిలో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పశువుల వద్దకు చేరుకొని పశు వైద్యాధికారికి విషయం వివరించగా, పశు వైద్యాధికారి వచ్చి పరిశీలించి పశువుల దానాలో యూరియా కలిపారని చెప్పారు. అందువలనే గేదెలు మృతిచెందాయని నిర్ధారించారు. తన రెండు పాడి గేదెలు మృతిచెందడంతో సత్యారావును ఓదార్చడం గ్రామస్తుల ఎవరి తరం కాలేదు. ఈ పాపాన్ని మూటగట్టుకున్న దుర్మార్గుడు ఎవడో వాడు ఒక రోజు ఇలానే చస్తాడని గ్రామస్తులు శాపనార్థాలు పెట్టారు. అలాగే గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పల నాయుడులు రైతు ఆర్థిక పరిస్థితి దీనస్థితిని తెలిసిన వ్యక్తిగా కింతాడ సత్యారావుకి గ్రామస్తులు అంతా కలిసి తనకు అండగా నిలిచి ఆర్థికంగా సహాయం చేసి ఆదుకుందామని ముందుకు వచ్చారు.

క్రీడాభివృద్ధిలో తమదైన ముద్ర వేయాలి

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దయానంద్

జిల్లా క్రీడాధికారికి అభినందనలు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: జిల్లా క్రీడాధికారి (డీఎస్‌డీఓ)గా ఇటీవల నూతనంగా నియమితులైన కె. శ్రీధర్ ను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు. అనంతరం దయానంద్ మాట్లాడుతూ క్రీడాభివృద్ధిలో జిల్లాను ముందు స్థానంలో నిలిపి తమదైన ముద్రవేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన పారా జూనియర్, సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి పోటీలకు సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేసారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే అత్యధికంగా పారా క్రీడాకారులు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి పాల్గొన్నారని అన్నారు. జిల్లాలో ప్రతిభ గల దివ్యాంగ క్రీడాకారులకు కొదవలేదని, నిరుపేద కుటుంబాలకు చెందిన వీరికి ఆర్థికంగా ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల పారా క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందేలా చూడాలని కోరారు.

కుమార్ రాజా)కు ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బేబీనాయన

=విశాలాంధ్ర-బొబ్బిలి: కుమార్ రాజా శత జయంతి సందర్భంగా రాజా కాలేజ్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఫెస్ట్-2025 లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొని బొబ్బిలి కుమార్ రాజా కీ॥శే॥ ఆర్.వి.జి.కె. రంగారావు (కుమార్ రాజా, బొబ్బిలి) శత జయంతి సందర్భంగా బంధు, మిత్ర సపరివార సమేతంగా వారి కుమారుడు ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం, రాజా ఆర్.ఎస్.ఆర్.కే. రంగారావు కళాశాలలో, యాజమాన్యం ఏర్పాటు చేసిన శతాబ్ది ఉత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యే బేబీనాయన ని సాదరంగా ఆహ్వానించారు. ఈ వేడుక సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ, కుమార్ రాజా వారి రాజకీయ, రాచరిక విధానాలను గురించి మరియు వారి వ్యక్తిగత అభిరుచులు, వారు చేసిన ప్రజాసేవను గురించి కొనియాడారు. ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ, తాము రాజకుటుంబంలో పుట్టినప్పటికీ, సామాన్యుల వలె జీవనం సాగిస్తూ ప్రజాసేవలో ఇంత మంచి పేరు తెచ్చుకోవడానికి కారణం తమ తండ్రి క్రమశిక్షణ అని అన్నారు.. వారికి బాగా చదువుకునే విద్యార్థులు అంటే ఎంతో అభిమానం అని, నిరుపేద కుటుంబంలో ఉన్న అటువంటి కొందరు విద్యార్థులను సొంత ఖర్చులతో చదివించేవారని, తనకి కూడా అదే స్ఫూర్తి అని తెలిపారు. అంతే కాకుండా, గురువులు పట్ల కూడా వారు ఎంతో గౌరవం చూపేవారని, కాలేజ్ మరియు స్కూల్ విషయంలో లిగురువులు ఇచ్చే సలహాలను పాటిస్తూ కళాశాలలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చారని తెలిపారు. వ్యక్తిగతంగా క్రీడలపట్ల వారికి ఆసక్తి ఎక్కువ అని, 80 పైన వయసు వచ్చినా టెన్నిస్ ఆడేవారనిలి అన్నారు.. ప్రతిక్షణం వారి జ్ఞాపకాలతో గడుపుతుంటానని, ప్రజాసేవలో తమ అన్నదమ్ములు ఎల్లప్పుడూ తమ తండ్రి సూచనలను పాటిస్తామని చెప్పారు.. కాలేజ్ యాజమాన్యం ఏర్పాటుచేసిన "ఫెస్ట్-2025" పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం, విద్యార్థినీ విద్యార్థులు చేసిన "ఫ్లాష్ మాబ్" డాన్స్ ను వీక్షించి, ఏర్పాటు చేసిన 60 స్టాళ్లను సందర్శించారు.. విద్యార్థినీ విద్యార్థులు ఎమ్మెల్యే బేబీనాయన తో సెల్ఫీ లు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రఘునాథ రావు , రిటైర్డ్ ఉపాధ్యాయులు గోనా అప్పారావు, కళాశాల యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 10% రిజర్వేషన్ కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన పట్నాల వెంకటేష్

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్: వైకాపా ప్రభుత్వం గీత వృత్తిని నిర్వీర్యం చేసి, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిందని బీసీ సాధికారత యాత కార్పోరేషన్ రాష్ట్ర మెంబర్ పట్నాల వెంకటేష్ ఆరోపించారు. విజయనగరం నియోజకవర్గం 15 డివిజన్లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నూతన మద్యం విధానంలో దుకాణాలు, బార్లలో 10శాతం గీత కార్మికులకు కేటాయించాలనే నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. యాత కార్మికులతో తెలుగుదేశం పార్టీకి కుటుంబ బంధమని దానిని ఎవరూ విడదీయలేరని స్పష్టంచేశారు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లలో ఏ ఒక్క కార్మికుడికైనా ఒక్క రూపాయి ఇచ్చారా అని ఎద్దేవ చేశారు. చెట్టుపైనుండి పడ్డవారికి డబ్బులు ఇచ్చారా...? కార్పొరేషన్ నుండి డబ్బులు ఇచ్చారా..? కరోనా సమయంలో కల్లు గీస్తా ఉంటే, కేసులు పెట్టి హింసించింది వైకాపా ప్రభుత్వం అని ఆరోపించారు. గీత కార్మికుల గురించి మొట్టమొదటిసారి ఆలోచన చేసింది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో బుత్తల పైడ్రాజు, గొంప రాము, రీసు గుణ, నక్క సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షణ చేయాలి : పట్టణ సీఐ సతీష్ కుమార్

విశాలాంధ్ర-బొబ్బిలి: బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ పార్క్ గట్టుపై ఉన్న భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొబ్బిలి సీఐ కే సతీష్ కుమార్ తమ చేతుల మీదుగా కదంబం మొక్కను నాటి నీళ్లు పోశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కలు కార్బన్డయాక్సైడ్ ను పేల్చుకుని ఆక్సిజన్ విడుదల చేస్తుందన్నారు. తద్వారా గాలి శుద్ధ అవుతుందన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఫుల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటి దానిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. మానవాళి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి అనిల్, కేసత్యరాజు, ఉపాధ్యాయులు జి.రామారావు , బాల భాస్కరరావు, ఎం గౌరు నాయుడు, కృష్ణ దాసు, సత్యం నాయుడు, రాజశేఖర్ .. గ్రీన్‌బెల్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులకు వినియోగదారుల హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు మద్దతు



విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవరలో గత 48 రోజులుగా శాంతియుతంగా నిరసన చేపడుతున్న జిందాల్ నిర్వాసితులను వినియోగదారుల హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే కలిసి, వారి న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ పాండే మాట్లాడుతూ జిందాల్ నిర్వాసితులకు పూర్తి అన్యాయం జరిగిందని న్యాయపరంగా 100% జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటామని తెలిపారు. జిందాల్ నిర్వాసితులకు కచ్చితంగా తమ భూమి తమకు వస్తుందని లేదా దానికి ప్రస్తుతమున్న రేట్ల ప్రకారం డబ్బు వస్తుందని తెలిపారు. జాతీయస్థాయిలో మీకు కావాల్సిన పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. మీకు మీ రాష్ట్రంలో న్యాయం జరగకపోతే దేశ రాజధాని అయిన ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపడానికి రావాలని జిందాల్ నిర్వాసితులకి సూచించారు. కేంద్ర మంత్రుల సహాయ సహకారాలు కూడా మీకు ఉంటాయి అని హామీ ఇచ్చారు. మీరు ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగారు అయినా సరే మీ భూముల్లో మీరు స్వేచ్ఛగా తిరగలేకపోవడం ఖచ్చితంగా ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని అన్నారు.మీరు చేసే పోరాటం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు,కంపెనీ కి వ్యతిరేకం కాదు అని , మీ హక్కుల కోసం మీరు పోరాడుతున్నారు అని అన్నారు.త్వరలోనే మీకు న్యాయం జరుగుతుంది అని మీకు కావల్సిన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. దేశ మూలల నుండీ రోజు రోజుకీ జిందాల్ నిర్వాసితులు కి ఆదరణ పెరగటం తో, త్వరలోనే తమకు న్యాయం జరుగుతుందని జిందాల్ నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు.

రహదారి భద్రతకు ఆగస్టు లో వివిధ అంశాల పై ప్రత్యేక డ్రైవ్

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకొని, రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా ఆగస్టు మాసంలో డ్రంకన్ డ్రైవ్, ఓవర్ స్పీడు, హెల్మెట్ ధారణ మరియు బ్లాక్ స్పాట్స్ వద్ద ఎన్ఫోర్సుమెంటు కేసులు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ ఆదేశాలతో రహదారి భద్రతకు ఆగస్టు మాసంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణాలైన డ్రంకన్ డ్రైవ్, ఓవర్ స్పీడు, హెల్మెట్ ధరించడం ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, వారిపై కేసులునమోదు చేయడం, ఈ-చలానాలను విధించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ నుండి పైస్థాయి పోలీసు అధికారులు జిల్లాలో ప్రతీ రోజూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, నమోదు చేసిన కేసులు వివరాలను జిల్లా కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించామన్నారు. ఆగస్టు మాసంలో ఒక్కొక్క వారం రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణాలైన ఒక్కొక్క అంశంపై దృష్టి పెట్టి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా డ్రంకన్ డ్రైవ్, అతి వేగం, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నట్లుగా జిల్లాఎస్పీ తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ జిల్లాలో ఇప్పటికే ప్రారంభించామన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపిన వాహనదారులను ఉపేక్షించవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అతివేగంతో వాహనాలను నడిపి ఇతర వాహన దారులకు లేదా ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసే వాహనదారులపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నట్లుగా గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరుగుటకుగల కారణాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడు బ్రాకర్లను, స్టావర్లును ఏర్పాటు చేయాలని, సంబంధిత విభాగాలఅధికారులతో మాట్లాడి లైటింగు, అవసరమైతే ఇంజనీరింగు మార్పులు చేయడం, మొక్కలను తొలగించడం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆడబిడ్డల రక్షణ సమాజ భాధ్యత

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఆడబిడ్డల రక్షణ సమాజ బాధ్యతగా తీసుకున్నప్పుడే పుట్టిన ప్రతి ఆడబిడ్డ వృద్ధిలోకి వస్తుందని సబ్ ట్రెజరీ అధికారి పి వి పద్మనాభం అన్నారు. కారుణ్య మరియు రోటరీ ఆధ్వర్యంలో బొబ్బిలి గిరిజన సంక్షేమ బాలిక ల ఆశ్రమ పాఠశాల లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలను కారుణ్య సంస్థ చైర్మన్ జె సి రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న బాలికలు రోటరీ ప్రతి నిధులకు రాఖీలు కట్టగా 320 మంది విద్యార్థులకు మిఠాయిలు తినిపించి పంపిణీ చేశారు. అనంతరం జె సి రాజు మాట్లాడు తూ ప్రతి బాలిక చదువుకోవాలన్నారు. అమ్మా,నాన్నల మాటను వినాలని ప్రతిపనిలో అమ్మ నాన్నను గుర్తించు కోవాలన్నారు. కార్యక్రమం లో రోటరీ పూర్వ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, సభ్యులు జయప్రకాష్ సిబ్బంది,చిన్నారి ఇ వాంజిలిన్,బాలికలు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాలకు పొటెత్తిన భక్తులు

వాసవి మాతకు సారె సమర్పణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల ప్రకారం శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా వాసవి క్లబ్ విజయనగరం అధ్యక్షులు విజ్జపు విజయ్ ఆధ్వర్యంలో 'చీర-సారె' కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం కు పట్టు వస్త్రాలు, 52 రకాల పిండి వంటలతో సారె సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయ్ మాట్లాడుతూ లోక కళ్యాణర్థం ప్రజలు సిరిసంపదలతో తులతుగాలని వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కేబినెట్ సెక్రటరీ(అడ్మిన్) ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ నిరంతరం సమాజసేవా కార్యక్రమంలు చేపడుతుండడం వాసవి క్లబ్ ముఖ్య ఉద్దేశ్యం అని, త్వరలో పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.వి. కృష్ణారావు,మాచర్ల చంద్రశేఖర గుప్త,డిమ్స్ రాజు,కట్టామూరి శంకర్రావు, గుడిశా వినోద్, ప్రాజెక్ట్ చైర్మన్ రత్నారావు,రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు,క్లబ్ కార్యాదర్శి నానాజీ, కోశాధికారి కృష్ణారావు, కుమార్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి గుడిలో వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర-పూసపాటిరేగ: విజయనగరం జిల్లాలోనే ఏకైక నదీ సాగర సంగమ తీరంగా ప్రసిద్ధి చెందిన కోనాడ గ్రామంలో వేంచేసి యున్న అతి పురాతనమైన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో శ్రావణమాస పర్వదిన శుభ సందర్భంగా నెల రోజులు విశేష పూజ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మూడవ శుక్రవారం వరలక్ష్మి వారం కావడంతో దేవస్థానంలో వేంచేసి యున్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి ఉదయం శ్రీసూక్త విధానంగా శ్రీ చక్రమునకు అభిషేకము, లలితా సహస్రనామంతో లక్ష్మీ అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చనలు జరిగాయి. మాసానాం శ్రావణ మార్గశీర్షం మాసాలన్నిట్లో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి శ్రవణ మాసం మన్న మార్గశిర మాసం మన్న అత్యంత ప్రీతికరము అని దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వాద్రేవు నాగరాజు శర్మ శ్రావణమాస విశిష్టతను తెలియజేశారు. ఈ శ్రావణమాసంలో సువాసినీలు కుంకుమ పూజలు జరిపించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి భక్తులకు తెలియజేసి, తీర్థ ప్రసాదాలను ఇచ్చి, ఆశీర్వదించారు.

గ్రామాల్లో ప్రతి ఇంటా వరలక్ష్మీ వ్రతం పూజలు



విశాలాంధ్ర-వంగర: గ్రామాల్లో ప్రతీఇంట్లో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. వివాహిత స్త్రీలు ఘనంగా ఈ పూజలు నిర్వహించారు. ప్రతీ వివాహిత స్త్రీ ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ వ్రతాన్ని చేపట్టారు. శుక్రవారం రోజున, వరలక్ష్మీ రూపంలోని లక్ష్మీదేవిని పూజించారు. ఈ వ్రతం చేస్తే లక్ష్మీదేవి ప్రత్యేక ఆశీస్సులు మెండుగా లభిస్తాయని, ఆనందం, ఐశ్వర్యం, శ్రేయస్సు లభిస్తుందని నమ్ముతూ అవసరమైన పిండివంటలు, వివిధ రకాల పళ్ళు ఆ తల్లి చిత్రపటాల ముందు పెట్టిలక్ష్మీ వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. వివాహితులు ముఖ్యంగా తమ భర్త, పిల్లలు, కుటుంబం సంతోషంగా ఉండేందుకు ఈ రోజున లక్ష్మీదేవి కి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల సంపద, శ్రేయస్సు, శక్తి, భూమి, జ్ఞానం, ప్రేమ, కీర్తి, శాంతి ఆశీస్సులు లభిస్తాయని నమ్ముతారు.

నిరుపేదలకు చీరలు పంపిణీ

హర్షం వ్యక్తం చేసిన గిరిజన మహిళలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కొండ గంగుబూడి పంచాయితీ శివారు గదబవలసలో కేజియో ఫౌండేషన్ ద్వారా నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ మహావ్రతం పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామానికి చేరుకొని నిరుపేద స్త్రీలకు చీరలను పంపిణీ చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ కేజీయో ఫౌండేషన్ సంస్థ గత రెండేళ్లుగా పేదల సేవలో తరిస్తుందన్నారు. కార్యక్రమంలో కేజియో ఫౌండేషన్ ఎన్జీఓ బూర్జ బారికి ప్రసాదరావు, గమ్మెల చిన్నమ్మి, గమ్మెల అప్పలనాయుడు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాలకు పొటెత్తిన భక్తులు

ఈవో వి.శ్యామలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర-రాజాం: స్థానిక శ్రీ నవదుర్గ అమ్మవారు, శ్రీ జ్ఞాన సరస్వతిదేవి, అమ్మవార్ల దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రావణమాసంలో పవిత్రమైన రోజుగా పరిగణించే మూడవ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకుని అమ్మ వారులను దర్శించుకున్నారు. ఈవో వి.శ్యామలరావు, ధర్మకర్త నర్సింగరావు ల సూచన మేరకు సిబ్బంది భక్తులకు ఇబ్బంది. కలగకుండా ఏర్పాట్లు చేసారు. అర్చకులు రామాయణం శ్రీనివాస శర్మ, రంప రామ చంద్రశర్మల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సిఐ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆరు తులాల బంగారు ఆభరణాలు బాధితురాలికి అప్పగింత

వన్‌టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె. చౌదరి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజయనగరం పట్టణం కామాక్షి నగర్ కు చెందిన పిల్ల పద్మ సొంత పనుల నిమిత్తం ఆగస్టు 7న సాయంత్రం కామాక్షినగర్ వద్ద ఆటో ఎక్కి పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద దిగిపోయారు. ఆమె ఆటోలో బ్యాగు మర్చిపోయినట్లుగా తరువాత గుర్తించి, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి ఆదేశాలతో వన్‌టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బంది వెంటనే ఆటోను ట్రేస్ చేసేందుకు చర్యలు చేపట్టారు. పోలీసులు చేపట్టిన చర్యలలో భాగంగా దగ్గరలో లభించిన సి.సి.టి.వి. ఫుటేజ్ ఆధారంగా ఆటోను ట్రేస్ చేయగా, ఆటోలో బ్యాగు లభించింది. అనంతరం, బ్యాగును అందులోగల ఆరు తులాల బంగారు ఆభరణాలను వన్‌టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు బాధితురాలైన పిల్ల పద్మకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో అప్పగించారు. ఆటో డ్రైవర్ కూడా ఆటో వెనుక ఉన్న బ్యాగును గుర్తించలేనట్లుగా పోలీసులు తెలిపారు. ఆటోను ట్రేస్ చేసి బ్యాగును, విలువైన బంగారు ఆభరణాలను అప్పగించుటలో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బందిని సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి అభినందించారు.

ఆగూరులో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ..

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలం ఆగూరు గ్రామంలో వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలక్షన్ లలో ఇచ్చిన బూటకపు హామీలు, ప్రజలను ఏ విధంగా మోసం చేసి అధికారంలోకి వచ్చారో అని ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వివరించి మరో మారూ చంద్రబాబు మోసాలకు, మాయ మాటలకి పడిపోవద్దనీ ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు లావేటి రాజగోపాల్ నాయుడు, జడ్పీటీసీ బండి నరసింహులు మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కౌనారీ అప్పారావు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షులు డా.బి నరేంద్ర,సోషల్ మీడియా కన్వీనర్ బట్న వంశీ మరియు గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాటు తుపాకి కలిగి ఉంటే చట్టరీత్యా నేరం

బొబ్బిలి సిఐ నారాయణరావు

విశాలాంధ్ర-బాడంగి: నాటు తుపాకీలు కలిగి ఉంటే చట్టరీత్యా నేరమని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు అన్నారు. మండలం బొత్స వాని వలస పంచాయితీ అనుసంధానం గ్రామమైన గదబ వలస గ్రామంలో నాటు తుపాకీలు ఉన్నాయని తెలిసి ఆ గ్రామంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేని తుపాకీలు ఎవరు వద్ద ఉన్న కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి తుపాకీలు కలిగి ఉంటే బాడంగి పోలీస్ స్టేషన్ అప్పజెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాడంగి ఎస్సై తారకేశ్వర రావు తో పాటు 30 మంది పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఆత్మీక సోదర భావమే సనాతన ధర్మం

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఆత్మిక సోదర భావమే సనాతన ధర్మమని బ్రహ్మ కుమారిస్ సేవా కేంద్రాల జిల్లా ఇంచార్జ్ రాజయోగిని బికే అన్నపూర్ణ అన్నారు. చీపురుపల్లిలోని ప్రజాపిత బ్రహ్మకుమారిస్ సేవాకేంద్రం లో రక్షాబంధన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరమాత్మ రక్షణలో స్వయాన్ని బంధించుకోవాలని శాంతియుత జీవితాన్ని జీవించాలని సూచించారు. ఇదే అసలైన రక్షాబంధన్ అని అన్నారు. పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన బ్రహ్మకుమారీలకు ఆమె రాఖీ ధారణ చేశారు. కార్యక్రమంలో స్థానిక సేవా కేంద్ర ఇంచార్జి టీకే శాంతి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే అతిథి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: సుపరి పాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఈరోజు 37వ డివిజన్‌లో శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు "మహిళా ప్రాంగణం బిసి కోలనీలో" ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం "బిసి కోలనీ హెల్త్ సెంటర్ జంక్షన్" లో సమావేశం నిర్వహించడం జరిగింది. తదుపరి విజయనగరం మండలం "ముడిదాం" గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, అనంతరం ముడిదాం గ్రామంలో సమావేశం నిర్వహించారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: గిరిజనుల వద్ద తుపాకులు ఉన్నాయేమోనని అనుమానం తో శుక్రవారం ఎస్ కోట పంచాయతీ రేగ పుణ్యగిరి మరియు గిరి లోవ గిరిజన గ్రామాల్లో సీఐ నారాయణమూర్తి ఎస్సై మరియు పదిమంది సిబ్బందితో కలిసి రెండు గ్రామాల్లో సుమారు 65 ఇళ్లల్లో మరియు ఆ గ్రామాల పరిసర ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశం ఏర్పరిచి ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉండడం నేరమని ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు అప్పగించవలసిందిగా తెలియజేశామన్నారు.

జాతీయ సంపదను రక్షించండి

ఐడిబిఐ ప్రైవేటీకరణను ఆపండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జాతీయ సంపదను రక్షించాలని ఐడిబిఐ ప్రైవేటీకరణ ఆపాలని ఆపాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యదర్శి ఆర్ రాజశేఖర్ అన్నారు. ఈనెల 11న ఐడిబిఐ బ్యాంకు వద్ద జరిగే సమ్మె కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు లో భాగంగా శుక్రవారం రింగ్ రోడ్డు వద్ద ఉన్న యూనియన్ బ్యాంకులో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ రాజశేఖర్ మాట్లాడుతూ జాతీయ సంపదను రక్షించాలని ఐడిబిఐ బ్యాంకు ను ప్రైవేటీకరణ చేయకుండా ఉంచాలని ఇది లాభం కోసం కాదని కేవలం ప్రజల కోసం అన్నారు. వాస్తవానికి ప్రభుత్వం , ఎల్ఐసి ప్రస్తుతం ఐడిబిఐ బ్యాంక్‌లో 95% వాటాను కలిగి ఉందన్నారు. కొనుగోలుదారులు విదేశీ పెట్టుబడిదారులు (కెనడా, దుబాయ్ నుండి). ఐడిబిఐ పబ్లిక్ డిపాజిట్లలో 23 లక్షల కోట్లు కలిగి ఉందని 3 సంవత్సరాలలో 30,000 కోట్ల లాభాలు వస్తున్నాయన్నారు.అమ్మకం అంటే ప్రజల డబ్బు లాభాలను ప్రైవేట్/విదేశీ చేతులకు అప్పగించడం.51% ప్రభుత్వ వాటాను నిలుపుకునేందుకు 2003 పార్లమెంటు ఇచ్చిన హామీ విఫలమవుతుందన్నారు. పెద్ద స్కామ్‌లు %ట% చెడు రుణాలతో ముడిపడి ఉన్న ప్రైవేట్/విదేశీ బ్యాంకులు ఆత్మనిర్భర్ భారత్‌తో ఏకీభవించట్లేదన్నారు. దీనికి నిరసన గా ఈనెల 11న ఐడిబిఐ బ్యాంకు లో జరిగే సమ్మెకు ఏఐబిఈఏ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు.

హర్ ఘర్ తిరంగా ప్రచార సామగ్రిని ఆవిష్కరించిన నగరపాలక కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : స్వాతంత్ర దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని విజయనగరం నగర పలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రచార సామగ్రిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ భారతదేశానికి స్వేచ్ఛ వాయువులు లభించి ఆగస్టు 15 నాటికి 79 సంవత్సరాల పూర్తిగా కావస్తుందని అన్నారు. ఆ పర్వదినాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తరంగా పేరిట వివిధ కార్యక్రమాలు రూపొందించామన్నారు. వివిధ ప్రాంతాలలో సెల్ఫీ స్టాండ్లను అమర్చామని చెప్పారు. సదరు సెల్ఫీ స్టాండ్ లో క్యూఆర్ కోడ్ ఉంటుందని సెల్ఫీ తీసుకున్న ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ కు తమ సెల్ఫీ ఫోటోను పంపాలని కోరారు. అలాగే ప్రశంస పత్రాలను కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పోస్టర్లు, బ్యానర్లను రూపొందించినట్లు చెప్పారు. నేటి నుండి ఆగస్టు 15వ తేదీ వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెఫ్ & డంబ్ స్కూల్ లో వేడుకగా

రక్షా బంధన్ జరుపుకున్న మన సిరమ్మ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో వైష్ణవ వీధిలో ఉన్న డెఫ్ & డంబ్ పాఠశాలలో విద్యార్థులతో రాఖీ పండుగ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్. సి.పి. జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు(చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర (సిరమ్మ) మధ్యాహ్నం స్కూలు పిల్లలతో సహపంక్తి భోజనం చేసి, అనంతరం స్కూల్ రాఖీ పండుగ నేపథ్యంలో పిల్లలు అందరికి రాఖీలు కట్టి, వారందరికీ చాక్లెట్స్, స్వీట్స్ పంచి కొంత సేపు వారితో ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమం లో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, సోల్జర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు